సైబర్ సెక్యూరిటీ కోర్సులకు ఆన్ లైన్ శిక్షణ

కాచిగూడ, మార్చి 24: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్‌స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఆన్‌లైన్‌లో శిక్షణకు తెలంగాణ వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ అడపా వెంకట్ రెడ్డి తెలిపారు. బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సులలో ఆన్లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఓరాకిల్ తదితర కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న.. పూర్తి చేసిన యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050, www. nationalskillacad emy. in లో సంప్రదించాలని కోరారు.

రేపు అన్నమాచార్య వర్ధంతి మహోత్సవాలు

రవీంద్రభారతి, మార్చి24: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ–శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు, శ్రీసప్తగిరీశ సాంకీర్తన సౌరభం అన్నమయ్య సంకీర్తనల వ్యాఖ్యాన సహిత గాత్రగోష్ఠి నిర్వహిస్తామని ప్రముఖ వ్యాఖ్యాత వెంకట్ గరికపాటి తెలిపారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరి కృష్ణ, గేయరచయిత కలగా కృష్ణమోహన్, సంగీత గురువు, దర్శకుడు కె.రామాచారి, ప్రముఖ చిత్రకారులు శ్రీకూచి, సభా అధ్యక్షుడిగా శ్రీ సుధామ హాజరవుతారని వెంకట్ గరికపాటి తెలిపారు.ఈ కార్యక్రమానికి భక్తులు హాజరుకావాలని కోరారు.

కొత్త క్రీడలపై అధ్యయనం చేయాలి

రుద్రసేన టీం సభ్యులకు క్రికెట్ కప్ అందజేస్తున్న అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, ప్రతినిధులు

కాచిగూడ, మార్చి 24: విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించుకోవడానికి కొత్త క్రీడలపై అధ్యయనం చేయాలని కాచిగూడ వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. వైశ్య హాస్టల్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ క్రికెట్ పోటీలలో పలు క్రికెట్ టీంలు పాల్గొనగా ధనుష్ కుమార్ కెప్టెన్ గా వ్యవహరించిన రుద్ర సేన టీం విన్నర్ గా నిలిచింది. ముఖ్యఅతిథిగా ఉప్పల రాజేశ్వర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పబ్బతి రవి ప్రసన్న కుమార్, కోశాధికారి రాజేశ్వరరావు, శ్రీనివాస్, మేనేజర్ రమేశ్‌తో పాటు హాస్టల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

ఒవైసీనగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, మార్చి 24: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం ఒవైసీ నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని అన్నారు. ముస్లింలకు ముందస్తుగా ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట ఇన్‌స్పెక్టర్ డి. అశోక్, అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ముస్లిం మత పెద్దలు అఫ్రోజ్‌పటేల్, అమీర్, మోసిన్, నాయకులు సంతోష్‌చారి, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాసభ అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తాకు సన్మానం

హైదరాబాద్ ఆర్యవైశ్య సంఘం మహాసభ అధ్యక్షుడుగా ఎన్నికైన సరాపు లక్ష్మణ్‌గుప్తాను సోమవారం లంగర్‌హౌస్ ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు విప్పు వెంకటమతుర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగుప్తా, మాజీ అధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్‌గుప్తా, ఉపాధ్యక్షుడు మల్లిపెద్ది రాములయ్య గుప్తా, మీడియా కమిటీ కార్యదర్శి కొమురవెల్లి సుధాకర్‌గుప్తా, జోనల్ సెక్రెటరీ పార్సి లక్ష్మణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 24

శంకర్‌యాదవ్‌కుటుంబాన్ని పరామర్శించిన బండారు దత్తాత్రేయ

నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ యాదవ్‌బస్తీలో నివసించే బీఎంఎస్ నాయకుడు శంకర్ యాదవ్‌కుటుంబాన్ని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. శంకర్ యాదవ్ మృతి బీజేపీకి తీరని లోటని దత్తాత్రేయ అన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 24

యూజీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలి

జియాగూడ, మార్చి 24: యూజీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని హైదరాబాద్ నిజాం కళాశాలలో విద్యార్థులు సోమవారం అందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఫలితాలు విడుదల చేయకపోతే పై చదవులకు ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లో పీజీ ప్రవేశ పరీక్షలు ఉంటాయని ఫలితాలు విడుదల చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించక పోతే కళాశాల బంద్‌కు పిలుపు నిస్తామని హెచ్చరించారు. తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను కోరారు.

నిజాం కళాశాలో ప్రిన్సిపాల్ కార్యాలయం ముందు బైఠాయించిన విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కార్వాన్‌లోని కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. (1993–94)బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని తమ గురువులను ఘనంగా సన్మానించారు. పాత మిత్రులను కలుసుకుని ఒకరినొకరు పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

– కార్వాన్

పోలీస్ పహారాలో ప్రజావాణి

- ఏడాది దాటినా పరిష్కారం కాని సమస్యలు
- బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్ గౌడ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ కుమార్‌గౌడ్

అబిడ్స్, మార్చి 24: ప్రజావాణి ఫిర్యాదులు గత ఏడాది కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పోలీస్ పహారాలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజావాణిలో పలుమార్లు ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని, అధికారులను నిలదీసినా ప్రజలకు సమాధానం చెప్పకుండా, పోలీసులచే బయటకు గెంటేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో అనేక సమస్యలపై ఫిర్యాదు చేసినా పరిష్కారానికి నోచుకోవడం లేదని, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ గురించి మాట్లాడే వారిని పోలీసులు బయటకు పంపిస్తున్నారని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం ఎందుకని, సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వానికి చేతగాని పక్షంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సూచించారు.

రోడ్డు ప్యాచ్‌వర్క్ పనుల పరిశీలన

సాయిబాబా గుడి లైన్‌లో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మ

అంబర్‌పేట, మార్చి24 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిబాబా గుడి లైన్‌లో జీహెచ్ ఎంసీ ద్వారా చేపట్టిన రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట రెడ్డి సోమవారం పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, గోవిందు అర్జున్, ఆర్బీఐ రమేశ్ తదితరులతో కలిసి ప్యాచ్‌వర్క్ పనులు సరిగా చేయాలని ఏఈ మనీషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవిలకు చెప్పారు. నిత్యం అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబా గుడికి వస్తుంటారని, అలాగే ఈ రోడ్డు ద్వారా చాలా మంది ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. నాణ్యతలో లోపం లేకుండా పనులు చేపట్టాలని సూచించారు.

శోభాయాత్ర రూట్‌లో ఎమ్మెల్యే పర్యటన

అబిడ్స్, మార్చి 24: శ్రీరామ నవమిని పురస్కరించుకుని నిర్వహించే శోభాయాత్ర రూట్‌లో గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజా సింగ్ పర్యటించారు ద్విచక్ర వాహనంపై ఆయన దూల్‌పేట్‌లోని ఆకాశపురి హనుమాన్ దేవాలయం నుంచి రూట్‌ను పరిశీలిస్తూ సుల్తాన్ బజార్ వరకు తిరిగారు. అనంతరం అధికారులతో శోభాయాత్ర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శోభాయాత్రకు పెద్ద ఎత్తున రామ భక్తులు తరలి వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దుబ్బాక లావణ్య, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్‌లతో పాటు బీజేపీ నాయకులు కార్పొరేటర్లు సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీరామనవమి శోభాయాత్ర ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తున నిర్వహిస్తామని శ్రీరామ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ శోభాయాత్రను విజయవంతం చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నా కుటుంబం జోలికి వస్తే ఖబడ్దార్..

నా కుటుంబం జోలికి వస్తే ఖబర్దార్ అని గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. ఇటీవల పోలీసులు రాజాసింగ్ కు భద్రత విషయమై నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. బుల్లెట్ ప్రూఫ్ కారు వాడాలని, ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లరాదని సూచించారు అయితే ఆయన అవేమీ పట్టించుకోకుండా సోమవారం శ్రీరామనవమి శోభాయాత్ర రూట్‌లో ద్విచ క్ర వాహనంపై పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని చిన్నచిన్న వీధులలో కారులో ప్రయాణించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కుటుంబం జోలికి ఎవరు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు

ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి : జీఎం

ప్రజలు వర్షం నీటిని ఒడిసి పట్టుకోవడానికి ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని జలమండలి డివిజన్ 3 జీఎం శ్రీను నాయక్ అన్నారు. మెహిదీపట్నం నవోదయ కాలనీలో ఉన్న జలమండలి డివిజన్ 3 కార్యాలయం ఆవరణలో ప్రపంచ నీటి పొదుపు వారోత్సవాలలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సీఈఓ దొరబాబు, కో ఆర్డినేటర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 24

ఓయూ సర్క్యులర్ రద్దుకు మద్దతు ఇవ్వండి ..

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని రకాల ఆందోళనలు, నిరసనలను నిషేధిస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని విద్యార్థి నేతలు విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్‌లను కలిసి పరిస్థితిని వివరించారు. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా జారీ చేసిన సర్క్యులర్ ను తక్షణమే ఉపసంహరించుకునే విధంగా ప్రభుత్వం, ఓయూ అధికారులతో మాట్లాడాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొకైన్ అమ్ముతున్న వ్యక్తి రిమాండ్

కాచిగూడ, మార్చి 24: కొకైన్ అమ్ముతున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ టి.జోత్స్న, డీఐ సురేశ్‌బాబు తెలిపిన ప్రకారం.. ముంబాయికి చెందిన గాడ్విన్ ఐఫెనహి.. పాత నేరస్తుడు. కొంత కాలంగా కాచిగూడ రైల్వే స్టేషన్ పార్సల్ కార్యాలయం సమీపంలో ఇద్దరు స్నేహితులతో కలిసి కొకైన్ అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కొకైను అమ్ముతుండగా గాడ్విన్‌ను పట్టుకొని కాచిగూడ పోలీసులకు అప్పగించారు. అతని నుంచి రూ. 42 వేల విలువచేసే 7 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు.

రైలుఢీకొని యువకుడు మృతి

కాచిగూడ, మార్చి 24: పట్టాలు దాటుతుండగా రైలుఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని యువకుడు సోమవారం కందికల్ గేట్‌లో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దావాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9948695948లో సంప్రదించాలి.

వ్యక్తి ఆత్మహత్య

గోల్నాక, మార్చి 24: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అంబర్‌పేట పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ డి.అశోక్ తెలిపిన ప్రకారం .. ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎన్. రోహిత్ నాయక్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధురై రైల్లో దొంగతనం

కాచిగూడ, మార్చి 24: మధురై స్పెషల్ రైల్లో దొంగతనం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. తమిళనాడు మధురైకి చెందిన మాణిక్యం మదురై స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అతని బ్యాగును చోరీ చేశారు. అందులో రూ.15,600 నగదు, క్రెడిట్, డెబిట్, ఆధార్ కార్డులున్నాయి. సోమవారం కేసు నమోదు చేసుకొని కర్నూల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

కూరగాయల మార్కెట్‌కు.. చెత్త కంపు

- అవస్థలు పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

గుడిమల్కాపూర్ మార్కెట్ పక్కనే వేసిన చెత్త కుప్పలు

మెహిదీపట్నం, మార్చి 24 : ప్రజల ఆరోగ్యం అధికారులకు పట్టడం లేదు. బస్తీలలో కాలనీలలో పేరుకుపోతున్న చెత్తకుప్పలను జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఎప్పటికప్పుడు తరలించకపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్వాన్ నియోజకవర్గం లోని అతిపెద్ద మార్కెట్ అయిన గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ వద్ద చెత్త కుప్పలు పెద్ద ఎత్తున పేరుకు పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునే నాథుడు లేడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ పక్కన అల్లూరి సీతారామరాజు నగర్, క్రిస్టల్ గార్డెన్ వెళ్లే రోడ్డులో మట్టి , చెత్తకుప్పలు నిండిపోయి రోడ్డు మొత్తం దుర్గంధ భరితంగా మారింది. 15 రోజుల నుంచి ఈ రోడ్డులో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తున్నా జీహెచ్ఎంసీ సర్కిల్–13 అధికారులకు అసలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్తకుప్పలను తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తకుప్పలను వెంటనే తొలగించాలి

మార్కెట్‌కు రావాలంటే ఇబ్బందిగా మారింది. మార్కెట్‌కు సమీపంలో చెత్తవేస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది. అయినప్పటికీ జీహెచ్ ఎంసీ అధికారులు పట్టించుకోక పోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని పోరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తొలగించాలి.

– వీరయ్య, గుడిమల్కాపూర్

క్షయ నివారణ మనందరి బాధ్యత

క్షయపై అవగాహన ర్యాలీ ప్రారంభించిన ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

బన్సీలాల్‌పేట, మార్చి 24 : ప్రపంచ క్ష య వ్యాధి నివారణ దినోత్సవం సందర్భం గా గాంధీ వైద్య కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నివారణకు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడమే మార్గమని అన్నా రు. ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవంగా పాటిస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని రోగి దగ్గినప్పుడు మైక్రో బ్యాక్టీరియం ట్యూబెరిక్లోసిస్ అనే క్రిమి గాలిలో వ్యాపించడంతో ఇతరులకు వ్యాధిసోకే అవకాశం ఉందన్నా రు. సకాలంలో వైద్యం తీసుకోవడంతో పాటు కోర్సును క్రమం తప్పకుండా తీసుకుంటే క్షయ వ్యాధిని అరికట్టవచ్చని అన్నా రు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ వ్యాధి కి మందులు, పరీక్షలు, చికిత్స ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సురేఖ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పూజ, డాక్టర్ స్వాతి, ఎంపీహెచ్ ఈ ఓ వేణుగోపాల్ గౌడ్, ఫారుక్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఫార్మసీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) (ఆల్ స్పెషలైజేషన్స్) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఐఎస్) రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 26 నుంచి, మాస్టర్స్ డిగ్రీ ఇన్ పోలీస్ మేనేజ్‌మెంట్ వన్ టైం చాన్స్ పరీక్షలను వచ్చే నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వివరాలను ఓయూ వెబ్సైట్‌లో చూసుకోవాలన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

ఇఫ్తార్ విందు

రంజాన్ మాసం పూర్తి కావడానికి ఇంకా వారం రోజులు ఉందని యువత పవిత్రంగా మెలగాలని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ మజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం సాయంత్రం అహ్మద్నగర్ లో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 24

రోడ్డు నిర్మాణం పూర్తి

కార్వాన్ నియోజకవర్గ నానాల్ నగర్ డివిజన్ హకీంషా దర్గాలో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం పూర్తి అయ్యాయి. ఈ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ నసీరుద్దీన్ పరిశీలించారు.

– మెహిదీపట్నం, మార్చి 24

గృహిణి ఆత్మహత్య

కాచిగూడ, మార్చి 24 : భర్త దూరం పెట్టడంతో మనస్థాపం చెంది భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న, అడ్మిన్ ఎస్సై సుభాష్ వివరాల ప్రకారం.. బర్కత్‌పుర లోని రాఘవేంద్ర స్వామి దేవాలయం సమీపంలో సతీశ్ భార్య నాగమణి(45) కొంతకాలంగా ఉంటుంది. సతీశ్ భార్యను దూరం పెట్టడంతో నాగమణి మనస్తాపం చెంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో రాడుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దావాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.